పింఛన్ పెంపుతో పేదల జీవితాల్లో వెలుగు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్‌ను రూ.3వేలకు పెంచడంతో వారి జీవితాల్లో వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ నాయకులు, హరూన్ గ్రూప్ ఎండీ అహ్మద్ బాషా అన్నారు. గురువారం స్థానిక 27వ డివిజన్‌లో వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నామమాత్రంగా పింఛన్ ఇచ్చేవారని, ప్రతినెలా ఆ పింఛన్ తీసుకోవాలంటే వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎన్నో వ్యయప్రయాసలకు లోను కావాల్సివచ్చేదన్నారు. గంటల తరబడి వేచి చూసి సొమ్మసిల్లి పడిపోయిన వారు ఎంతో మంది ఉన్నారన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితిని చూసి చలించి పోయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే రూ.2వేలుగా ఉన్న పింఛన్‌ను రూ.3వేల వరకూ పెంచుకుంటూ పోతామని హామీ ఇచ్చి అక్షరాలా అమలు చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. ముఖ్యంగా ప్రతి నెలా ఒకటోతేదీనే తెల్లవారుజామున ఇంటి తలుపుతట్టి వలంటీర్ల ద్వారా ఠంఛన్‌గా పింఛన్ అందివ్వడం జరుగుతోందన్నారు. పింఛన్ పొందేవారు ఇంట్లోంచి కాలు బయటికి పెట్టకుండానే ప్రభుత్వం పింఛన్ ఇస్తోందని, ఇంత మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అవ్వాతాతలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం 700 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ జహీర్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



వికలాంగుడికి పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా



పింఛన్ కానుక కార్యక్రమానికి హాజరైన వృద్ధులు, మహిళలు

హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

చింతకొమ్మదిన్నె : ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పింఛన్ లబ్ధిదారులకు రూ.3 వేలవకు పింఛన్ అందిస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకున్నారని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పెంచిన పింఛన్ల పంపిణీతో పాటు, నూతన పెన్షన్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో నూతన పెన్షన్లు కావాలి అంటే, ఎవరైనా చనిపోవాలి లేదా, జన్మభూమి కమిటీల సిఫారసు ఉండాలి అనేవారు. ప్రస్తుతం అర్హత ఉంటే చాలు వలంటీర్లు పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, ఎంపీడీవో రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నెలో పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

అర్హులందరికీ పింఛన్లు

వీరపునాయునిపల్లె : మండల పరిధిలో కొత్తగా 80 పింఛన్లు మంజూరైనట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయాల వారిగా మంజూరైన పింఛన్ వివరాలను తెలియజేశారు. అనిమెల 4, గంగిరెడ్డిపల్లె 3, ఇందుకూరు 8, మొయిళ్లచెరువు 8, ఎన్.పాలగిరి 13, పాయసంపల్లె 7, ఎస్.పాలగిరి 8, తలపనూరు 3, యు.రాజుపాలెం 3, ఉరుటూరు1–5, ఉరుటూరు2–3, వీరపునాయునిపల్లె 13, వెల్లుర్తి 2 పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు గతంలో మంజూరైన పింఛన్‌దారులకు ఈనెల 8వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

‘రోబోటిక్’ కీళ్ల మార్పిడి సేవలు



సర్జరీని నిర్వహిస్తున్న డాక్టర్ జహంగీర్‌బాష

కడప రూరల్: కడప నగరంలోని జేబీ హాస్పిటల్‌లో అత్యాధునిక రొబోటిక్ కీళ్ల మార్పిడి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆ ఆసుపత్రి కీళ్ల మార్పిడి వైద్యులు జహంగీర్‌బాష అన్నారు. గురువారం స్థానిక ఆ హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాకు చెందిన జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ చెన్నై బ్రాంచ్‌లో రోబోటిక్ కీళ్ల మార్పిడిలో ప్రత్యేక శిక్షణను పొందినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక సర్జరీ జిల్లాలో మొదటి సారిగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వాసులు అత్యాధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

వైవీయూ: పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సలీం బాషా పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సాఫ్ట్‌స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీసోర్స్‌పర్సన్‌గా హైదరాబాద్‌కు చెందిన మై ఆపరేటర్ కంపెనీ మార్కెటింగ్ మేనేజర్ మమతా పండిట్ విచ్చేసి విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డా. కె. నాగమునిరెడ్డి, డా. ఎన్. ఆనంద్‌కుమార్‌రెడ్డి, జె. మేరీసుగుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం..

కళాశాలలో గతనెల 27 నుంచి నిర్వహించిన జాతీయస్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా మాట్లాడుతూ 7రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమం బోధనావృత్తికి సంబంధించిన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్‌లు డా. అంబుజం అయ్యర్, డా. ఎ. అమరావతి, డా. సి. కృష్ణవేణి, డా. సౌదామిని మీనన్ తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

ఫొటోగ్రఫీ కోర్సు ప్రారంభం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రశాఖ ఆధ్వర్యంలో ‘ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ’ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ ఫొటోగ్రఫీ, ఫొటోషాప్‌లకు మార్కెట్‌లో మంచి ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు చక్కటి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అర్థశాస్త్ర అధ్యాపకుడు డా. గురుమోహన్ రెడ్డి మాట్లాడుతూ 30 రోజుల పాటు నిర్వహించే ఈ కోర్సులో విద్యార్థులకు ఉచితంగా నైపుణ్యాలను నేర్పుతామన్నారు.

పూర్వ విద్యార్థినికి అభినందన..

కళాశాల పూర్వ విద్యార్థిని వేముల వర్షిణి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ డా. కె.వి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా. పి. గురివిరెడ్డి, జేకేసీ మెంటార్లు వరప్రసాద్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

9న ఆర్‌సీపీ సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 9న నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మక్బూల్ బాషా పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ జిల్లా నాయకులు తస్లీమ్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నూతన నియామకం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో పలువురి మహిళలకు నియామక పత్రాలను అందజేశారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో నగర మహిళా ప్రధాన కార్యదర్శిగా సులోచన, నగర ఆర్గనైజేషన్ సెక్రటరీగా వెంకట సుబ్బమ్మ కు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జపాన్ భూకంప మృతులకు నివాళి

కడప కల్చరల్ : జపాన్ భూకంప మృతుల ఆత్మశాంతి కోసం మాసాపేట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం మాసాపేట విచారణ సెయింట్ జాన్ చర్చి గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిమె దేవ సహాయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రొఫెసర్ సెయింట్ జాన్ రీజనల్ సెమినరీ డైరెక్టర్ డాక్టర్ రెవరెండ్ సగినాల పాల్ ప్రకాష్ మాట్లాడుతూ జపాన్ భూకంప బాధితులకు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్ పాల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ ఆపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ అడ్మిషన్స్, డొనేషన్‌లు, ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల తీరు మార్చుకోకుంటే ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశాలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆశా కార్యకర్తలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని పాత రిమ్స్‌లోని ఆయుష్మాన్ భారత్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు నరసమ్మ, బి శాంతమ్మ, దేవీ లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి గ్రామీణ మేళా

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 12వ తేదీ వరకు స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో నాబార్డు గ్రామీణ మేళా నిర్వహించనున్నట్లు దాస్ సొసైటీ ప్రతినిధి ఓబుళదాసు తెలిపారు. ఉత్పత్తిదారులచే ఈ ప్రదర్శనలో నేరుగా తయారీ ధరలకే విక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

వినూత్న నిరసన

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెను చర్చల ద్వారా నివారించాల్సిన ప్రభుత్వం రోజువారీ దినసరి కూలీలను తెచ్చి కార్మికులను బెదిరించడం సరైనది కాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేసి. బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో తనిఖీ



బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీ చేస్తున్న దృశ్యం

కడప అర్బన్: కడప నగరంలో ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు గురువారం రాత్రి డ్రంకన్ డ్రైవ్‌పై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి ఎవరైనా వాహనాలను నడిపితే వారికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీలు చేపట్టి వారిపై చర్యలు తీసుకున్నారు. కడప నగరంలోని ఇర్కాన్ సర్కిల్, ఎస్పీ బంగ్లా సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఇంకా వివిధ సర్కిళ్లలో తనిఖీలు చేపట్టారు.

7న ఓపన్ చెస్ టోర్నమెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఈనెల 7వ తేదీ ఆదివారం 2వ జిల్లాస్థాయి ఓపన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ తెలిపారు. 1 నుంచి 10 స్థానాలు సాధించిన వారికి ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8341255151 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బ్రెయిలీకి ఘన నివాళి

కడప కల్చరల్ : లూయీ బ్రెయిలీ ప్రపంచంలోని అంధుల పాలిట జ్ఞానేనేత్రమని మాజీ కార్పొరేటర్ జాకీరుద్దీన్ అన్నారు. బ్రెయిలీ జయంతిని గురువారం స్థానిక అంగడివీధిలోని ప్రజా సహాయార్థం ఆంధ్ర ప్రదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాకీరుద్దీన్ తన కుమారుడు జుబేర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సంస్థకు రూ. 12 వేల చెక్కును ప్రదానం చేశారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, కార్పొరేటర్

కడప కార్పొరేషన్: మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకోవాలని 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్య నారాయణ రావు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్‌లోని 100 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ పుస్తకాలు ఉచితంగా అందజేశారు. అనంతరం కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో రవీంద్రనగర్‌కు పోయే బ్రిడ్జి కింద జూదమాడుతున్న షేక్ షబ్బీర్, మరో ఏడుగురిని సీఐ సి. భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 51,810 నగదుతో పాటు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు.

సమస్యలను పరిష్కరించండి

కడప ఎడ్యుకేషన్: సాంఘీక సంక్షేమశాఖ వసతిగృహ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో అధికారులు విఫలమయ్యారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ అన్నారు. హాస్టల్స్ సమస్యలను జిల్లా అధికారులకు దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లినా పరిష్కరించలేదని ఆరోపించారు. గురువారం ఆయన ప్రకాస్‌నగర్‌లోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమశాఖ బాలుర కళాశాల వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

భక్తిభావం



కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని కాలభైరవపురంలోగల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి జయంతి ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు మేరువ బాలాజీరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజోత్సవాలను నిర్వహించారు. మూలమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పూలతో కనుల పండువగా అలంకరించారు. సాధారణ పూజలతోపాటు సామూహికంగా శ్రీ కాలభైరవస్వామి అష్టోత్తర పఠనం చేశారు. ప్రత్యేక పూజల్లో భాగంగా కుష్మాండ (గుమ్మడికాయ) దీపాలు వెలిగించి స్వామి ప్రత్యేక హారతులు ఇచ్చారు. నిర్వాహకులు అన్నదానం చేశారు.

క్రీడోత్సాహం



కడప స్పోర్ట్స్ : క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడాపోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. సచివాలయ స్థాయిలో రిజిష్టర్ చేసుకున్న పురుషుల, మహిళలు మైదానాలకు విచ్చేసి తమ జట్లు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. క్రీడాస్ఫూర్తి ప్రదర్శిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా పోటీలు కొనసాగుతున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. మండలస్థాయిలో జరిగే పోటీలను ఆయా మండల ఎంపీడీఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

అవగాహన పథం



కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే పిల్లలు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం అన్నారు. కడప ప్రభుత్వ బాలికల కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రవీంద్రనగర్‌లో వారం రోజులపాటు క్యాంపును నిర్వహించనున్నారు. మొదటి రోజు గురువారం రవీంద్రనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు స్పెషల్ క్యాంపుపై అవగాహన కల్పించారు. జమాల్ ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ మురాద్, హెచ్ఎం నరేంద్ర బాబు, హెచ్ఎం బిబిజాన్‌లు మాట్లాడారు. అనంతరం ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థులు ర్యాలీ, మెడికల్ క్యాంపు నిర్వహించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కడప కలెక్టరేట్ వద్ద ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రావాల్సిన బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం దిగిరాకపోతే జనవరి 9, 10 తేదీలలో విజయవాడలో 36 గంటల ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రామ్మోహన్, కవి చెన్నకేశవులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సగిలి రాజేంద్ర ప్రసాద్‌లు ఉద్యోగులు చేస్తున్న ధర్నాకు తమ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షులు రవికుమార్, సుజాత రాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సహస్ర దీపార్చన



రాజంపేట పట్టణంలోని రామ్‌నగర్‌లో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం రాత్రి సహస్ర దీపార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన ఏడాదిలో వచ్చిన తొలి గురువారాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

- రాజంపేట టౌన్

10వ రోజుకు కార్మికుల సమ్మె

కడప కార్పొరేసన్: తమ డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె పదో రోజుకు చేరుకుంది. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి అనంతరం నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వేషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఐఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు , యూనియన్ నాయకులు కె. తిరుపాల్, గోపి, కిరణ్, శ్రీధర్ బాబు, నాగరాజు, ఆదాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంధులకు ఆదర్శం లూయిస్ బ్రెయిలీ

కడప ఎడ్యుకేషన్: అంధులకు ఆదర్శం లూయిస్ బ్రెయిలీ అని పాలకొండయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొండాసుబ్బయ్య, అంధుల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్యలు పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని గురువారం కడప అంధుల ప్రభుత్వ పాఠశాలలో ఉన్న లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని అన్నారు. అంధులు బ్రెయిలీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, రాయల్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం శంకరయ్య, కొండా సుబ్బయ్య తదితరులు